ఆషాఢస్య ప్రథమదివసే.....

సింగరాజు రామచంద్రమూర్తి

బస్సు దిగిన రమణమూర్తి టైము చూసుకున్నాడు. ఎనిమిదిన్నర అయింది. తను ఏర్పాటు చేసిన టైముకి ఇంకా అరగంట వ్యవధి ఉండడం వలన హోటల్ కేసి నడిచాడు.

"తను ఖచ్చితంగా తొమ్మిదికల్లా ఫలానా చోట ఉంటానని అక్కడకు ఆవేళకి తప్పకుండా రావలసిందని" రాశాడు వసుంధరకి. తనకున్న టైమ్ సెన్స్ విషయం బంధువులందరికి తెలుసు. అందుకే మామయ్య సరదాగా "వాడు ఫిలియాస్ ఫాగ్ లాంటి వాడే!" అంటుంటే తనకి ఆనందం కూడా.

కాబట్టి వసుంధర ఆ వేళకి అక్కడికి రావడం ఖాయం. తను అంతకు ఒక్క నిముషం ముందుగానే అక్కడకు చేరుకోవడం అంతకన్న ఖాయం. తామిద్దరూ కలిసి ఈరోజు సరదాగా గడపడమన్నది బోలెడు ఖాయం!.... హుషారుగా ఈలేసుకుంటూ హోటలులోకి వెళ్లి ఒకమూల కూర్చుని సర్వరుకి కావలసినవి చెప్పాడు. మళ్లీ తను తన ఆలోచనల్లోకి జారిపోయాడు.

ఒక్క వారంరోజులు శెలవు రావడంవలన ఎన్నో కలలతో ఇంటికి వచ్చిన తనకి అమ్మ చెప్పిన వార్త పిడుగుపాటులా తోచింది.

"మావయ్య ఉత్తరం రాశాడురా రేపు ఆదివారం నుంచి ఆషాఢ మాసంట. కొత్తల్లుడు, అత్తగారు ఒక గడప దాటకూడదు అనటా" అని అంది మాటవరసకి చెప్పినట్లు ఆ పైది ఊహించుకోవడం నీ వంతు అన్నట్లు.

తనకి ఒళ్లుమండిపోయింది. ఈకాలంలో కూడా ఇంకా ఇటువంటి పట్టింపులేమిటని? పూర్వం అయితే పెళ్లి చేసుకున్న వాడికి వేరే ఏమంత పనుండేది కాదు కాబట్టి ఇంటి చుట్టూ తిరుగుతాడని కొన్నాళ్లు ఎడబాటు కలగజేసి ఆ ముచ్చట చూద్దామని ఏర్పాటు చేసిన ఆచారం ఇది. ఇప్పుడో?

ఆ మాటే అనేశాడు. "నాకు అటువంటి వాటిలో నమ్మకంలేదు. చదువుకున్న వాళ్లం. మనకి కూడా ఈ ఆచారాలేమిటి?" అని.

అందుకావిడ "నీకు లేకపోవచ్చు. పెద్ద వాళ్లం మేం బ్రతికున్నన్నాళ్లూ ఇటువంటి ముచ్చట్లు ఉంటుంటాయి. పెద్దవాళ్లు ఎందుకు పెట్టారో మనకేం తెలుసు?" అంది.

తనకి నవ్వు వచ్చింది. కేవలం పెద్ద వాళ్లు పెట్టిన వాటి మీది గౌరవం కొద్దీ కన్నా భయం కొద్దీ ఆచరించే వాళ్లని చూస్తే తనకి జాలి. కాని అమ్మతో మాత్రం ఇంక ఆ విషయం మీద చర్చ పెంచుతే, ఆవిడేమంటుందో తనకి తెలుసు.

పెళ్లయిన వారానికల్లా ట్రయినింగ్ కోసం వెళ్లిపోయిన తను ఇన్నిరోజులనగా ఈ శెలవు కోసం ఎంతగా ఎదురు చూస్తున్నదీ వీళ్లకెలా తెలుస్తుంది? మళ్లీ ఈ అవకాశం పోతే ఇంకా ఎన్నాళ్లు వేచి ఉండాలో!

తను చదువుకున్నవాడు. వసుంధర చదువుకుంటున్నది. తను చేయవలసిందేదో చేసుకుపోవాలి. వెంటనే కార్యరంగంలోకి దిగాడు. వసుంధరకి ఉత్తరం రాశాడు తన ప్లాను గురించి. స్నేహితుడు వినాయక రావుకి రాశాడు చేయవలసిన సహాయం గురించి. శనివారం అతను వచ్చినప్పుడు కలుసుకున్నాడు. అంతా సవ్యంగా అనుకున్నట్లు జరిగిపోవడం తనకి ఆనందాన్ని కలిగించింది.

అయితే తరువాత "ఇటూ అటూ ఉన్న పెద్దలకి తెలుస్తే అన్న" సందేహం కలిగింది. "తెలుస్తే మాత్రం కొంపలంటుకు పోయిందేముంది? అదీ నేనూ భార్యాభర్తలం కామని ఎవరయినా అనగలరా? ఈనాడు కావడమే కాదు. చాలాకాలంగా, ఇంచుమించు వసు పుట్టినప్పటి నుంచీ తన భార్యగా వ్యవహరింపబడింది. పెళ్లయాక కూడా "కొన్నాళ్లు ఆగడం మన సంప్రదాయం

అని వాళ్ళు అన్నారు కాబట్టి సరిపోయింది కాని.....”

నవ్వొచ్చింది రమణమూర్తికి.

తక్కున పెట్టిన ప్లేటు చప్పుడుతో ఊహల్లోంచి కిందికి దిగాడు.

హోటలు బయటికి వచ్చాక టైము చూసుకున్నాడు. తను అనుకున్న దానికి ఇంకా అయిదు నిముషాలుంది. సిగరెట్టు ముట్టించి బయలుదేరాడు.

అతను ఆగిన వెంటనే అతని ముందు రిక్షా వచ్చి ఆగింది. అందులోంచి వసుంధర ముందుకు వంగి “వచ్చాను”అంది నవ్వుతూ.

“చాలా పంక్చువల్‌గా వచ్చావే”

“అవునుమరి. మీకున్న బిరుదం తెలియని దాన్ని కానుగా!”

“దట్స్ గుడ్! మరొకటి ఉంది చెప్పవలసింది. అనవసరంగా సిగ్గుపడకూడదు. మొగ్గలా ముడుచుకుపోతే ఇప్పుడే బస్సెక్కేస్తాను.”

“అలాగే”

ఆమె జరిగి చేసిన చోటులో కూర్చున్నాడు రమణమూర్తి. రిక్షా పూలపల్లకీలా కదిలింది.

“ఎక్కడికిట యాత్ర?”

“తెలియదా నీకు? అన్నట్టు నీకా విషయం రాయలేదుగా” అని పెద్దగా రిక్షా అతనితో చెప్పాడు ఎక్కడికి వెళ్ళాలో.

“సినిమా కన్నమాట!”

“అన్నమాటేమిటి—మొగుడు మాట!” అని ఒక్కక్షణం ఆమె వంకచూసి “ఇదివరకెక్కడనో చదివిన గుర్తు. ఒక సినిమా తార ఫొటో కింద ‘దిగినాను దిగినాను దివి నుండి భువికి’ అని రాశాడు” అన్నాడు నవ్వుతూ.

“మెచ్చుకున్నాం గాని ఈ కార్యక్రమం ఏమిటి, ఇలా దొంగచాటుగా మనం తిరగడమేమిటి?”

“పెద్దవాళ్ళ మీద యువతరం చేస్తున్న తిరుగుబాటు! ఆచారాల్ని నేనూ గౌరవిస్తాను. కాని వాటికి అర్థం ఉందా లేదా అని ఆలోచించాలి..సరేగాని ఇప్పుడీ రిక్షా అబ్బాయికి నేనెవరినో తెలుసా?”

ఫకాలున నవ్వింది వసుంధర.

“అంత తిరుగుబాటు చేసే యువకులకి ఇంత భయం కూడదు.”

“ఏడిశావు లేవోయ్. నా ఉద్దేశ్యం అది కాదు. ఎవడో పరాయి మగాడితో తిరుగుతోంది ఈ అమ్మాయి అనుకుంటే.....”

“అందుకని ఏం చేస్తారుట?”

“చెబుతాను అతనికి. ‘ఈ అమ్మడు సాక్షాత్తూ నా భార్య. ఏదో కాసేపు సరదాగా వెంటేసుకు తిరుగుదామని వచ్చాను. పెద్దవాళ్ళు రాక్షసుల్లా ఉంటే వాళ్ళని తప్పించుకుందుకు చాటుగా అఘోరిస్తున్నాము’ అని చెప్పనా?”

“సంతోషించాము కాని అతనికి మీరెవరో తెలుసు. మా నాన్నగారికి స్పేటు రిక్షా వాడు. కాబట్టి మీరు రాడీలని అనుకోడు సరా!”

“మంచి ముందు చూపు ఉంది సుమీ నీకు.! ఇంట్లో ఏమని చెప్పి వచ్చావు?”

“మా ఫ్రెండు ఇంటికి వెడుతున్నానని, సాయంత్రం దాకా వాళ్ళ ఇంట్లో నలుగురం కలిసి ఆడుకుంటామని!”

“ఆ ముగ్గురూ మీ ఇంటికి రావాలిట ఇవ్వాళ!”

“అప్పుడుమాత్రం భయం ఏమిటి? పరాయి వాళ్ళతో గాని ఊరేగుతున్నానా?”

“నిన్ను ‘లా’ చదివిస్తానుగాని అమ్మడూ ఇక బుర్ర పాడుచేసుకోకు. ఇదే సెంచేసెను సినిమా హాలు”

సినిమాలో కూర్చున్నామన్న మాటేగాని అందులోని ఒక్కమాట వినడంలేదు. ఒక్క బొమ్మ చూడడంలేదు రమణమూర్తి. తను పెళ్ళయిన తరువాత ఈ నెలరోజులుగా ఎంతగా ఈ ఎడబాటును గురించి తపించిపోతున్నదీ, ఈ వారంరోజుల శలవు కోసం ఎన్నినాళ్ళుగా ఎదురు చూస్తున్నదీ ఇంటికి రాగానే అమ్మ చెప్పిన ఆషాఢమాసం మాట విని తన ఒళ్ళు ఎంతగా మండిపోయిందీ వివరంగా చెబుతున్నాడు.

“ఇదేదో కొత్త గోల, పాపం వాళ్ల ఉసురు మనకేల తగలనీ” అన్న నీతిమంతులు చుట్టుపక్కల సీట్లు ఖాళీ చేసి బహుదూరపు బాటసారులయి పోయారు. ఆ ఓపిక లేనివాళ్ళు అలానే కూర్చుని సగం సినిమా అయ్యాక లేద్దాంలే అని సరిపెట్టుకున్నారు.

“కూల్ డ్రింక్స్ సార్!” అన్నాడు ఇంటర్వెల్‌లో ఒక కుర్రాడు వచ్చి.

రెండు తీసుకుని ఒకటి వసుంధర కిచ్చి ఒకటి తను తాగి అతనికి డబ్బివ్వబోయాడు.

“అయ్యగా రిచ్చేశారు సార్!” అనేశాడు వాడు వినయంగా. ఆశ్చర్యపోయాడు రమణమూర్తి “ఏ అయ్యగారోయ్?”

“మా మానేజరు గారండి!”

“మానేజరు గారా?”

“అవునండి ఈ హాలు మానేజరుగారు!”

రెండవసారి ఆశ్చర్యపడి లేచి “నువ్వుగాని ఎరుగున్నావా వసూ” అనడిగాడు.

వసుంధర చిరుకోపాన్ని అభినయించి “నేనెరగడ మేమిటి?” అంది విసుగును జోడిస్తూ.

“ఐ సీన్, మీ నాన్నకి ఈయన స్నేహితుడయి ఉండి నిన్నెరుగున్నా డేమోనని”

“ఉహూ, నాకు తెలియదు”

“నిన్ను పంపించింది మా దగ్గరకు కాదేమోనయ్యా, డబ్బు పుచ్చుకో!”

“మీ దగ్గరకే నండి మాస్టారూ, నేనే పంపించింది. మీరు నన్నెరుగరు కానీండి మీ మావగారు నాకు ఫ్రెండు. మీ పెళ్ళికి కూడా వచ్చాను” అంటూ వచ్చి పక్కన కూర్చున్నాడొక సిల్కు లాల్చీ ఆయన.

కుర్రవాడు చెప్పిన ఆయన ఈయనేనని గ్రహించడం వలన “నమస్కారమండీ, మీ డ్రింక్స్‌కి థాంక్స్!” అన్నాడు మూర్తి.

కాసేపు అతని ఉద్యోగం గురించీ, వాటి గురించి అడిగి వెడుతూ వెడుతూ “ఉంటారా రెండురోజులు” అన్నాడాయన.

“అహ. శలవు లేదండీ. ఈ రోజే వెళ్ళిపోతాను”

“అలాగా! మీ మావగారిని సాయంత్రం ఒకసారి రమ్మనండి”

ఆయన వెళ్ళిపోయాక “కొంపదీసి ఈ విషయం మీ నాన్నకి చెప్పడు కదా!”అన్నాడు వసుంధరతో.

నవ్వింది వసుంధర.

“భయంకాదు వసూ, బావుండదు”

“తరువాత ఎక్కడికిట” అంది వసుంధర హాలులోంచి బయటకు వచ్చాక.

“ఎందుకు, ఎక్కడికి అని సహధర్మచారిణి అడగకూడదు చిటికిన వేలుచ్చుకుని నడవడమే ధర్మం.”

“సరే బాగానే ఉంది. ఇప్పుడు వేలుచ్చుకుని రోడ్డుమ్మట నేను నడవలేను బాబూ! రిక్షా కట్టించండి చిటికిన వేలు పుచ్చుకుని కూర్చుంటాను.”

“టైము ఒంటి గంటవ్వస్తోంది. భోజనం చేయద్దూ మరి?”

“చేయద్దూ, వెళ్ళద్దూ అని అడగకూడదు అర్ధాంగిని”

“నవ్వులాట కాదు వసూ. భోజనం చేద్దాం పద”

హోటల్‌లో 'స్పెషల్' రూంలోకి తీసుకు వెళ్ళాడు. వాళ్ళిద్దరూ తప్పిస్తే అక్కడ మరెవరూ లేకపోవడం వలన సినిమా గురించీ ఉమ్మడి బంధువుల గురించీ, విడివిడిగా వాళ్ళ వాళ్ళ స్నేహితుల గురించీ మాట్లాడు కుంటూ భోజనం చేశారు.

చివరలో రమణమూర్తికి పెద్ద అను మానం కలిగింది. "అవునుగానీ వసూ, నేను మంచి ఆకలి మీద వచ్చాను. కాని మీరు పెట్టించుకోకుండా నాకు కడుపు నిండి పోయింది. ఏమిటి? ఎందువలన? తెలిసి చెప్పకపోతే నేను మళ్ళీ చెట్టు ఎక్కి కూర్చుం టాను."

"అయితే వినండి బేతాళరావు గారూ, మీరు తిన్నది ఇంచుమించు రెండు విస్తళ్ళ లోని అన్నం. నాకు ఆకలిగా లేనందు వలన వాయి చెల్లగా వాయి మీ విస్తట్లోకి రవాణా చేశాను సర్వారావుగారు లేనపుడు!"

"హారిసీ!"

"హాపీసీ అనాలి" సవరించింది.

కిళ్ళీ వేసుకుని సిగరెట్టు ముట్టించి రిక్షా ఎక్కడికి వెళ్ళవలసిందీ చెప్పాడు.

"కాసేపు మా వినాయకరావుగాడి గది అనబడే గుహలో విశ్రాంతి పెళ్ళికూతురుకీ పెళ్ళికొడుక్కీ."

ఖంగారు పడింది వసుంధర.

"ఒద్దు బాబూ, కాసేపు ఇలాగే ఎక్కడయినా తిరుగుదాం."

"సైలెన్స్, మాట్లాడకలా!...ఆ ఇంటి ముందు ఆపవోయ్...ఇంటివాళ్ళతో సంబంధం లేకుండా మనం నేరుగా పైకి వెళ్ళి పోవచ్చు. మంచి వసతిగల గదిలే!"

"అతను లేడా మరి?"

"వాళ్ళ పుట్టింటికి వెళ్ళాడు. ఇంకో నెలలో ఇది ఖాళీ చేసి ఫ్యామిలీ పెట్టు కుంటాడు. రా లోపలికి."

గుమ్మంలోనే నిలబడిపోయింది వసుంధర.

"కమాన్"

"ఊహూ. ఇక్కడ గుమ్మంలో కూర్చుం టాగాని కబుర్లు చెప్పండి"

"సిల్లీ గరల్" అంటూ చేయి పుచ్చు కుని లోపలికి తీసుకు వచ్చి తలుపు వేశాడు. "బుద్ధిమంతురాలిలా చెప్పినట్లు వినాలి. ప్రతి దానికి ప్రబతిమాలించుకోకూడదు. చదువు కుంటున్న దానివి సిగ్గుండదనుకున్నాను."

"గది చాలా శుభ్రంగా ఉందే! ఆడవాళ్ళు లేకపోయినా ఉన్నట్లే సర్దాడు మీ ఫ్రెండు" "పర్లే, మనం వస్తామని ఉత్తరం రాస్తే రెండురోజులు పడి సర్ది ఉంటాడు. ఉన్నప్పుడు ఈ గదిలో నేల మీద పడుకున్న మనిషి సాధారణంగా అగపడడు. అంత లోతున ఉంటుంది."

అంతలో తలుపు కొట్టిన చప్పుడవ డంతో ఖంగారుపడి "ఎవరు చెప్మా వచ్చింది" అని ఆశ్చర్యపోయాడు.

"ఇంటివాళ్ళేమో? దొంగలని అనుకు నుంటారు."

"నో, నో. మా వాళ్ళిలా వస్తారని ముందు గానే చెప్పి ఉంచాడు. వాళ్ళని డిస్టర్బ్ చేయద్దని కూడా చెప్పాడుట... చూసెద గాక"

తలుపు తీశాడు.

"నేనే నాయనా ఈ ఇంటిదాన్ని అబ్బాయి చెప్పి వెళ్ళాడనుకో. ఉరికే చూసి పోదామని వచ్చాను."

చూసింది కదా ఇకపోతుంది లెమ్మని గుమ్మంలోనే అడ్డంగా నిలబడ్డాడు రమణ మూర్తి.

"బయట మబ్బులు పడుతున్నాయే కాని వర్షం రాదు. ఈ కాలంలో ఇదొక పెద్ద చావు. హమ్మయ్య" అంటూ కూర్చుని

"పొద్దున్నుంచీ చేస్తుంటే ఇప్పటికి అయింది పని. అన్నట్టు నీ పేరేమిటన్నా వమ్మాయ్?" అంది.

"వసుంధర. నా పేరు రమణమూర్తి" హడావుడిగా చెప్పేశాడు. ఆవిడ ఇలా రావడం బావుండలేదు అతనికి. అందులోనూ కూర్చో వడం బొత్తిగా నచ్చలేదు. పుణ్యకాలం కాస్తా ఈవిడతోనే సరిపోయేట్టుందని అతని భయం.

"బాగున్నారు నాయనా జంట. అన్నట్టు జంట అంటే గుర్తొచ్చింది. మరే ఇది వరకు ఆ ఎదురిల్లు లేదూ—ఆ ఇంట్లో ఒకబ్బాయి అద్దెకొచ్చాడు. పెండ్లయితే గాని ఇచ్చేవాళ్ళు కాదు వాళ్ళు అతనికి పెళ్ళయిందని కాపరానికి రావడానికి ఇంకా కొంచెం ఆలస్యం ఉందని చెప్పి దిగాడు. కొన్నాళ్ళు పోయాక అమ్మాయిని తీసుకొచ్చి 'తలవు లిచ్చారు మామ్మగారూ. దీనికి, నాలుగురోజులు ఊరు చూపిద్దామని తీసు కొచ్చాను.' అన్నాడు.

పాపం ఆ ఇంటావిడ బాగా పెద్దది. సంబరపడిపోయి 'బాగున్నారు నాయనా చిలకా గోరింకల్లా' అని వాళ్ళకి కావలసిన సామానులు అడిగి పుచ్చుకోమని మొహమాట పడద్దనీ మరీమరీ చెప్పింది.

అలా ఒక నాలుగు రోజులున్నాక వెళ్ళి పోయిందా అమ్మాయి. తరువాత కొన్నాళ్ళకి తెలిసింది అసలా అబ్బాయికి పెళ్ళే కాలేదని! అది కూడా ఎలా తెలిసిందనుకున్నారూ? ఒకరోజు ఎవడో స్నేహితుడ్ని తీసుకొచ్చాడు.



చూపు అనుతుందా ఏమన్నానా ఈ మునలి దానికి, నిజంగానే స్నేహితుడనుకుంది. అయితే ఆ రోజే వాడి ఖర్మకాలి వాడి నాన్న వచ్చాడు. వాళ్లది చాలా దూరంలే విశాఖ పట్టణం పైన.

రావడమే పెద్ద రభస. ఆ స్నేహితుడు ఆడపిల్లట! అది నాయనా వరస. ఏం చెప్ప గలం ఈ రోజుల్లో పిల్లల వేషాలు. వెంటనే ఖాళీ చేయించింది.

మా రోజుల్లో ఇలా పెళ్లాలని వెంటేసుకుని తిరగటానికి భయం. అధవా, ఎక్కడికయినా తప్పనిసరి అయి బయలు దేరినా ఆయన ఒక ఫర్లాంగు ముందు. ఆవిడ ఒక ఫర్లాంగు వెనక ఉండేది. ఈ రోజులే వేరు.. హో..య్..నిద్ర ముంచు కొస్తోంది బాబూ. చల్లటి గాలి వేస్తోందా. అందులోనూ పెద్దతనం!" అంటూనే అలా గుమ్మం దగ్గరే ఒరిగిపోయిందావిడ.

రమణమూర్తికి ఒంటి మీద తేళ్లు జెర్రులు పాకినట్లయింది. అసలు ఈవిడ ఇదంతా ఎందుకు చెప్పినట్టు? తమ మీద నమ్మకం లేకనా? అసలు అవి జరిగాయా లేక కల్పించి చెప్పిందా. నిలదీసి అడుగుదామనుకున్నాడు. కాని అంతలో స్నేహితుడు రాగానే పెట్టె, పరుపు నెత్తిన పెట్టుకుని వీధిన పడవలసి ఉంటుందనీ, ఈ పట్టణంలో కొన్ని రోజులపాటు వీధిలోనే ఉంటే తప్ప మళ్లీ కొంప దొరకదని గుర్తు రావడం వలన ఆవేశాన్ని దిగమింగుకున్నాడు.

వెంటనే లేచి నిలబడి "రా వసూ, ఇక్కడ ఇంకొక్క క్షణం కూడా ఉండద్దు" అన్నాడు.

"ముందా మామ్మగారిని లేపండి. పాపం కని కట్టుకుని పైకి వచ్చింది!"

"నే నావిడతో మాట్లాడను."

నవ్వింది వసుంధర.

"బాగుండండి వరస. నా కావిడ మీద కోపం లేదుగానీ నే లేపుతాలెండి!" అని వెళ్లి ఆవిడని తట్టి "లేవరండి, మేం అలా బజారు వెళ్లి అటునించి ఊరెళ్లిపోతాము. ఇంటికి తాళం వేయాలి!" అంది.

"అయ్యో అప్పుడే వెళ్లిపోతున్నారూ?.. మంచిదమ్మా మా ఇల్లు కూడా ఒకసారి చూసి వెడుదువుగాని రా"

ఆవిడ రాక్షసుల తాలూకు మనిషని, కనుక వెళ్లద్దన్నట్టుగా సాధ్యమయినంత యాక్షన్‌తో తన ఉద్దేశ్యాన్ని వ్యక్తపరిచాడు రమణమూర్తి.

ఆషాఢస్య...

కాని వసుంధర అదేమీ పట్టనట్టుగా "మీరు తాళం వేసి రండి. నేను వాళ్లింటికి వెళ్లివస్తాను..పదండి" అంటూ ఆమె వెంట కిందకు నడిచింది.

చేతిలో పండుతో తిరిగి వచ్చి "బొట్టు నాకు, పండు మీకూనుట!" అని అతని చేతిలో పెట్టింది వసుంధర.

"పారేస్తే"

"తప్పు. పెద్దవాళ్లు బొట్టుపెట్టి ఇచ్చిన దాన్ని పారేయకూడదు. పాపం అక్కడనే నిద్రపోయినందుకు ఆవిడ ఏంతో ఇదయింది.

టైము చూసుకున్నాడు మూడుగంట లవబోతోంది. కాలం పరుగెడుతున్నట్లని పించింది అతనికి. "కాసేపు హాయిగా మాట్లాడుకోనయినా వీల్లేకుండా సోది చెప్పి ఇప్పుడు ఇదయిందిట హు....పద, రిక్షా ఎక్కు."

రిక్షా ఝామ్మంటూ వెళ్లి హోటలు ముందాగింది. కవుంటర్ దగ్గరికెళ్లి గది తీసుకుని అక్కడి పుస్తకంలో సంతకం పెట్టి "రా వసూ పైకి వెడదాం"అన్నాడు.

కుర్రాడు దారి చూపించగా ఇద్దరూ పై గదిలోకి వెళ్లారు.

"ముఖం కడుక్కుని వస్తాను బాబూ. ఎండ కొట్టేసింది" అంది వసుంధర లోపల అడుగుపెడుతూనే.

"అదుగోనండి, అది బాత్‌రూం. ఎప్పుడూ నీళ్లు వస్తుంటాయి" అని చూపించాడు కుర్రాడు.

"ఇదుగో కుర్రాడా, నువ్విలోపున కాఫీలు పట్టుకురా!"

కాఫీలతో బాటు ఒకాయన కూడా వచ్చాడు.

"మీరు చెప్పకపోయినా నా కాఫీ కూడా తెప్పించేసుకున్నాను" అని నవ్వి "ఈహోటల్ మాదేలెండి" అన్నాడాయన వస్తూనే.

ఎవరన్నట్టుగా చూశాడు రమణమూర్తి "ఈ హోటల్లో ఇది ఆచారమేమో స్వయంగా పరామర్శించి పోవడం" అని ఆశపడ్డాడు. కాని అతని ఆశ నిరాశయిపోయింది.

"మీ మావయ్య నాకు బెస్టుఫ్రెండు. రోజూ సాయంత్రంపూట వస్తాడు. ఇంకో రెండు పక్కలు కూడా వస్తాయి లెండి ఆ వేళకి. రెండాటలు వేస్తాం. నలుగురం కలిసి యూనివర్శిటీలో చదువుకున్నాం. వాళ్లు ముగ్గురూ ఉద్యోగాలు వెలిగిస్తున్నారు. నన్నీ హోటలు ఉద్ధరించమని పోయాడు మా నాన్న. అదీ విషయం. అమ్మాయీ, మీరూ వస్తూంటే లోపలున్నాను లెండి నేను...ఏమ్మా కులాసానా? ఏమిటీ ఇటొచ్చారు? అల్లుడుగారికి మన హోటలు చూపిద్దామని తీసుకొచ్చావా?"

రమణమూర్తికి కోప వచ్చేసింది.

"అవును బాబాయిగారూ. ఆయనే ఈ ఊళ్లో మంచి హోటలు రూంలో దిగాలని ఉందని చాలావాళ్లుగా ముచ్చటపడుతున్నారు. ఇక్కడయితే పైన ఖర్చులేదని.."

నవ్వుకున్నారు ఇద్దరూ. వాళ్ల నవ్వు విని నవ్వుదామని వ్యర్థప్రయత్నం చేశాడు రమణమూర్తి.

"మీరు కూడా ముఖం కడుక్కురండి. నా ప్రాణం ఇప్పుడు హాయిగా ఉంది" అంది వసుంధర.

"అక్కరలేదు."

"దట్సాల్ రైట్. ముందీ కాఫీ తాగండి. కొంచెం సేపట్లో స్పెషల్ టిఫిన్ చెప్పి వచ్చాను. అది వస్తుంది. డ్రింక్స్! అదీ మా ఆతిథ్యం. అంతవరకు ఏమయినా సరదాగా కబుర్లు చెప్పండి. మీ ప్రొయివింగ్ విషయాలు. అసలు మా వాడు మీరు వస్తున్నట్టు మాట మాత్రం చెప్పలేదే!"

"అల్లుడొస్తున్నాడని దిగులు కాబోలు"

రమణమూర్తి ఏమీ మాట్లాడకపోవడంతో ఆయనే ఆ అవకాశాన్ని వినియోగించుకోదలిచి తన కాలేజీ జీవితం, అప్పటికి ఇప్పటికి చదువులు ఎంతగా దిగజారిపోయిందీ, యూనివర్శిటీ హాస్టలు జీవితం వగయిరాల మీద అనర్గళంగా మాట్లాడేశాడు.

"మావాడికి సీటు కోసం మొన్న వెళ్లాను. యూనివర్శిటీ ఎంతగా మారిపోయిందనుకున్నారు. బోలెడు కొత్త బిల్డింగ్స్ కట్టారు. మీ మావగారితో ఆ మాటంటే అంటాడూ "మనం చేసిన ఫూలిష్‌థింగ్ అదేరా! అక్కడనే సెటిల్ అయిపోవలసింది. ఆ వాతావరణంలోనే ఇన్స్పిరేషన్ ఉంటుంది. మనం బాగుపడాలన్నా, ఇంకొకళ్లని బాగు చేయాలన్నా అది ఉపయోగపడుతుంది" అని.. ఎప్పుడూ వాడికి అదే యావ. ఇక్కడ మాత్రం వాడికేం తక్కువ చెప్పండి. నాలుగు చేతులు చాలవు సంపాదనకి. ఇందులో తృప్తి లేదుట!"

అంతలో ప్లేటలో టిఫెన్లు కాఫీల్

తెచ్చాడు కుర్రాడు.

"అమ్మాయ్, అది అల్లుడుగారి కివ్వు. అది 'టేస్టు' చేయండి. ఆ డిష్‌కి మన హోటల్ పెట్టింది పేరు."

మాట్లాడకుండా తినేసి "బావుంది, చాలా బావుంది. బోలెడు బావుంది!" అన్నాడు రమణమూర్తి.

అతన్ని చూసి ఫక్కున నవ్వింది హేమంధర.

"ఏం ఎందుకు నవ్వుతావూ? నీకు బాగా లేదా? రియల్లీ, నాకు చాలా బావుంది మాస్టారూ! దాని నవ్వుకేం లెండి కోతి"

"కోతి అంటే గుర్తుకొచ్చింది. చిన్నప్పుడు మేం నలుగురం కలిసి మహాకోతి పనులు చేసే వాళ్లం. మీ వాళ్లింటికి వెనక పక్క ఒక మామిడి తోట ఉండేది ఎవరిదో. వేసవికాలం వచ్చిందంటే అందులో కాయలు దొంగతనంగా కోయడం పెద్ద సరదా మాకు. మీకు అనుభవం ఉందో లేదో గాని కొన్న కాయలు వాటంత రుచి ఉండవు.

ఒకసారి మమ్మల్ని పట్టుకున్నాడు తోట

వాడు. నాలుగు కొడితే బావుండేది. కాని రాస్కెల్, ఇంటికి తీసుకెళ్ళి మీ తాతయ్యకి అప్పచెప్పాడు. ఆయన అసలే నిప్పు. పోనీ ఆయనయినా కొడితే బావుండేది. అలా చేయు లేదు. మిగిలిన వాళ్ళనిద్దరినీ వదిలేశాడు. పెద్దగా ఎరక్కపోవడం వలన నన్ను మీ మావయ్యనీ చెట్లకి కట్టేసి ఇంతింత కారం స్వయంగా కళ్ళల్లో పెట్టి "జీవితంలో మళ్ళీ దొంగతనం చేయకండి" అన్నాడు.

నిజంగానే చేయలేదు మళ్ళీ. మామిడి కాయలు చూస్తే ఆయనే గుర్తుకొస్తాడు. అన్నట్టు నాలుగయింది. మీ మావగారు వచ్చే వేళయింది. కూర్చునుండండి. ఒక్కసారి కిందకు వెళ్ళి వాడు రాగానే వెంటబెట్టుకు వస్తాను. ఒక్క పది నిమిషాల్లో వచ్చేస్తాడు" అని వెళ్ళిపోయాడు ఆయన.

"వాన వెలిసింది! వసుంధరా ఇకలే పోదాం" అన్నాడు నీరసంగా రమణమూర్తి.

"కాసేపుండండి. నాన్నగారు వస్తారటగా" నవ్వుతూ అంది.

"సర్లే ఇక నరొక్కటే తక్కువ. మీ నాన్నకి ఈ ఊళ్ళో ఇంత పరపతి ఉండడం బాధగానే ఉంది సుమీ...అయినా ప్రతిచోట కనీసం మనం మాట్లాడుకునేందుకయినా వీల్లేకుండా ఎవరో ఒకళ్ళు అడ్డం పడ్డారు.. ఇదంతా నాకేదో కొంచెం విచిత్రంగా ఉంది!"

"సర్లెండి, ఇప్పుడెక్కడికట ప్రయాణం"

"ఇక నేను పూర్తిగా ఓడిపోయాను. నీ ఇష్టం"

ఆషాఢస్య...

"అలా బుద్ధిమంతుల్లా ఉండాలి. ముందు పుణ్యం అన్నారు పెద్దలు. పదండి"

ఎక్కడికి అని అతను అడగలేదు. ఇద్దరూ కలిసి బయటికి వచ్చి గబగబ రిక్షాలోకి ఎక్కేశారు.

"దుర్గగుడికి పోనీయ్" అంది వసుంధర..

"చూడండి ఇక్కడి నుంచి ఎంత అందంగా అగపడుతుందో ఊరు. చిన్నప్పటినుంచీ నాకిది సరదా. ఇలా ఆకాశం అంత ఎత్తు మనం అయి ఆ ఇళ్ళు, చీమల్లా నడిచే మనుష్యులని చూస్తుంటే ఎంచక్కా ఉంటుందనీ!" తన్మయుత్వంతో కిందకు చూస్తూ అంది.

పైన నల్లగా మబ్బులు కమ్ముకుంటూనే ఉన్నాయి. కాకపోతే వర్షం కురవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లుగా చల్లటి గాలి వీస్తోంది. ఆ గాలికి ఎగురుతున్న ముంగురులు ఆమె నుదుటి మీద నాట్యం చేస్తుంటే తన్మయుడయి పోయాడు రమణమూర్తి.

"అవును ఇక్కడ చాలా బావుంది" అన్నాడు మెల్లిగా.

"వర్షం రాబోతోందని కింద రోడ్ల మీద చూడండి ఎంత హడావుడిగా వెడుతున్నారో?... రండి అమ్మవారి దర్శనం చేసుకుందాం."

పూజ చేయించాక "ఒక్కసారి మీ పర్సు ఇవ్వండి" అంది వసుంధర.

"ఎందుకు?"

"తిరిగేప్పుడు 'ఎక్కడికి' అని భార్య అడక్కూడదు. ఇటువంటి స్థలాల్లో 'ఎందుకు' అని భర్త అడక్కూడదు"

"అబ్బ"

నవ్వుతూ పర్సు ఆమె చేతికిచ్చాడు. అందులోంచి కొంత లెక్కపెట్టి తీసి హుండీలో వేసి నమస్కరించింది వసుంధర.

వింతగా చూస్తున్న రమణమూర్తితో "మన పెళ్ళయినందుకు అమ్మవారికి ఇస్తానన్న లంచం" అంది నవ్వుతూ.

ఆమె ముఖంలోకి చూసి చేయి పుచ్చుకుని మెల్లగా బయటికి తీసుకొచ్చాడు. ఎదురుగా ఉన్న మనిషిని చూసి ఆశ్చర్యపోయాడు.

తండ్రిని చూడ్డంతోనే రమణమూర్తి చేయి వదిలి వేడంగా నిలబడింది వసుంధర.

"ఊళ్ళో విహారంపూర్తి అయిందా మళ్ళీ ఇంకో సినిమాకి వెళ్ళాలా? నేనెరుగున్నది ఒక్క సినిమాహాలు మానేజరునే! పైగా ఇక తిరగలేను కూడా!"

సిగ్గుపడ్డాడు రమణమూర్తి.

కొండ దిగాక "ఇంటికి వెడదాం పద" అన్నాడాయన.

"వద్దులే నేను ఊరు వెళ్ళిపోవాలి. మళ్ళీ ఎప్పుడయినా వస్తాలే!"

బస్సు బయలుదేరబోతుండగా "ఈ వెళ్ళంగానే నాన్నగారికి ఉత్తరం రాస్తాను" అన్నాడాయన.

రమణమూర్తి మాట్లాడకుండా వసుంధర వైపు చూశాడు.

కళ్ళతోనే శలవు పుచ్చుకుందామె.

ఏడు గంటలయింది. బస్సు బయలుదేరింది.

కొంతదూరం వెళ్ళిపోయాక అతనికి పెద్ద అనుమానం కలిగింది. మావయ్య కనలు తను వస్తున్నట్లు ఎలా తెలిసింది? అని.

"వసుంధర ఎంత గడుసుది! ఏమీ ఎరగనట్లు తన వెంట తిరిగింది. ముందే తన రక్షణకి ఏర్పాట్లు చేసుకుని.

ఈ ఆలోచన రాగానే నవ్వొచ్చింది. అతనికి. తను చక్కగా మోసం చేయబడినందుకు.

"మొత్తానికి ఒక తియ్యటి కలలా జరిగి పోయింది లోజు" అనుకుని సరిపెట్టుకున్నాడు. ●



'మీ ఆవిడ మంచినీళ్ళనూతిలో జారిపడి చచ్చిపోయిందయ్యా'
'పోనీలెండి. రేపటినించి చెరువునీళ్ళే తాగుతాను!'